## క్లుప్తంగా

### అట్టహాసంగా సెమీ క్రిస్మస్



చిన్నారికి కేక్ తినిపిస్తున్న జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు భాస్కర్

శ్రీరంగరాజపురం: నిరుపేదల సంతోషమే నిజమైన క్రిస్మస్ అని జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు భాస్కర్ అన్నారు. మండలంలోని 50 బసివిరెడ్డిపల్లి షికారీ కాలనీ వాసులు నిర్వహించిన సెమీక్రిస్మస్ వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రేమ, శాంతి, కరుణ, ఆప్యాయతకు మారుపేరు ఏసుప్రభు అని అన్నారు. ప్రపంచ శాంతి స్థాపనకు కృషి చేసిన మహనీయుడు ఏసుప్రభు అని, ఏసు అడుగుజాడల్లో ప్రతి ఒక్కరూ నడవాలని పిలుపునిచ్చారు. అనంతరం కేక్ కట్ చేసి, అలాగే పేదలకు దుస్తులు అందజేశారు. కార్యక్రమంలో పాస్టర్ తులసి మణి, చిరంజీవి, విక్టర్ నాయకులు హుమేష్, కణ్ణన్ తదితరులు పాల్గొన్నారు.

### ఘనంగా పెన్షనర్స్ డే

కార్వేటినగరం: మేజర్ పంచాయతీ కార్వేటినగరంలో పెన్షనర్స్ డేని ఆదివారం విశ్రాంత ఉద్యోగులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్రాంత ఉద్యోగుల సంఘం భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో విశ్రాంత ఉద్యోగ సంఘం అధ్యక్షుడు మోహన్‌రెడ్డి మాట్లాడారు. విశ్రాంత ఉద్యోగ సంఘాల న్యాయ పోరాటం కోసం మొదట పోరాటం చేసిన డీఎస్ నకారా సేవలను కొనియాడారు. అదేబాటలో అందరూ పయనించాలని కోరారు.

### పైపులైను లీకేజీ సమస్య పరిష్కారం



పైపులకు మరమ్మతులు చేయిస్తున్న డీడీఓ

వెదురుకుప్పం: మండలంలోని పచ్చికాపల్లం పంచాయతీ బొమ్మన్‌దొడ్ల గ్రామానికి తాగునీరు సరఫరా అయ్యే పైపులు దెబ్బతినడంతో లీకేజీ ఏర్పడింది. ఈ సమస్యను అధికారులు ఆదివారం పరిష్కరించారు. గ్రామానికి సమీపంలోని కాలువలో ఉన్న బోరు నుంచి నీటిని వాటర్ ట్యాంకుకు సరఫరా చేస్తున్నారు. అయితే పొలంలో పైపు పగిలిపోవడంతో నీరు లీకేజీ అవుతోంది. ఈకారణంగా దీంతో తాగునీరు వృథాగా ప్రవహించడంతో పాటు నీరు కలుషితం అవుతోంది. గ్రామస్తులు సమస్యను ఎంపీడీఓ ప్రేమ్‌రాజ్‌కుమార్ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఎంపీడీఓ వెంటనే డీడీఓ శ్రీనివాసరావు ద్వారా జేసీబీతో మట్టిని తీసి కొత్తగా పైపులు అమర్చి సమస్యను పరిష్కరించారు.

### భక్తులకు అన్నదానం



అన్నదానం చేస్తున్న దాత మహేంద్రమణి

కార్వేటినగరం: అన్నిదానాల కన్నా అన్నదానం గొప్పదని టీటీడీ ఆలయ అధికారి సురేష్‌కుమార్ అన్నారు. ఆదివారం శ్రీవేణుగోపాల స్వామి ఆలయ ఆవరణలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న ఆలయ ఆలయ అధికారి సురేష్‌కుమార్ మాట్లాడారు. టీటీడీ ఆలయాల్లో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న అన్నదాన కార్యక్రమానికి శ్రీవేణుగోపాల స్వామి ఆలయంలో విశిష్టత నెలకొంది. టీటీడీ అధికారులు తిరుమల–తిరుపతి దేవస్థానంలో అనుసంధానంగా ఉంటున్న ఆలయాల్లో ప్రతి శుక్ర, శనివారాల్లో దాతల సహకారంతో అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. అయితే కార్వేటినగరంలో వెలసి ఉన్న రుక్మిణీ, సత్యభామ సమేత శ్రీ వేణుగోపాలస్వామి ఆలయంలో దాతలు ముందుకొచ్చి ప్రతిరోజు పేదలకు అన్నదానం చేయడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఆదివారం కుప్పానికి చెందిన భక్తుడు మహేంద్రమణి అన్నదానం చేపట్టారని తెలిపారు.

### వైభవంగా శ్రవణా నక్షత్ర పూజలు



ఉభయ దేవేరులతో కల్యాణ వెంకన్న

నారాయణవనం: శ్రీపద్మావతీ సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం శ్రవణ నక్షత్రాన్ని పురస్కరించుకుని ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువ జామున తిరుప్పావై సేవతో ఆలయాన్ని తెరచి నిత్యపూజా కైంకర్యాలను, ధనుర్మాస పూజలను అర్చకులు పూర్తి చేశారు. స్వామివారి జన్మ నక్షత్రమైన శ్రవణ గడియల్లో అర్చనలు చేశారు. సాయంత్రం శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఉత్సవమూర్తులను సర్వాంగ సుందరంగా అలంకరించి తిరుచ్చి వాహనం కొలువుదీర్చి తిరువీధుల్లో ఊరేగించారు. ఆలయానికి చేరుకున్న ఉత్సవర్లకు ఆస్థానం నిర్వహించి నైవేద్య సమర్పణం చేశారు.

# రెండు దశాబ్దాల సమస్యకు పరిష్కారం

- మైనారిటీలకు అండగా నిలిచిన మంత్రి ఆర్‌కే రోజా
- డ్రైనేజీ, రోడ్డు ఏర్పాటు చేయాలని మంత్రికి విన్నవించిన ఇందిరానగర్ వాసులు
- సమస్య పరిష్కారానికి చొరవ చూపిన మంత్రి రోజాకు కృతజ్ఞతలు



రోడ్డు, డ్రైనేజీ పనులకు భూమిపూజ చేస్తున్న మంత్రి ఆర్‌కే రోజా

నగరి: రెండు దశాబ్దాలుగా మున్సిపల్ పరిధిలోని ఇందిరానగర్ పల్లం అనే ప్రాంతంలో నివశించే వారు ఎదుర్కొన్న డ్రైనేజీ, సిమెంటు రోడ్డు సమస్యకు పరిష్కారం లభించింది. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఈ ప్రాంతంలో అధికంగా నివశించే మైనారిటీ మహిళలు మంత్రి రోజా దృష్టికి తమ సమస్యను విన్నవించారు. తమ ప్రాంతంలో డ్రైనేజీ రోడ్డు కావాలంటూ ఏళ్ల తరబడి పోరాడుతున్నట్లు చెప్పారు. ఈ ప్రాంతానికి విచ్చేసి పరిశీలించే నాయకులు, అధికారులు పల్లపు ప్రాంతం గనుక రోడ్డు, కాలువ వేయడానికి కుదరదంటూ వెళ్లిపోయేవారని మంత్రి ఎదుట వివరించారు. ఇళ్ల నుంచి వెలువడే మురుగునీరు ఎక్కడ వదలాలో తెలియక ఖాళీ స్థలాలపై వదిలేయాల్సి వస్తోందన్నారు. వర్షం వచ్చే సమయంలో నీరు నిలిచి ఇబ్బంది పడుతున్నట్లు చెప్పారు. అసాధ్యమైన పనులను సుసాధ్యం చేసే మంత్రి ఆర్కేరోజా ఈ ప్రాంతంలో రోడ్డు, డ్రైనేజీ నిర్మాణానికి ప్రత్యేక పథక రచన చేశారు. గడప గడపకు నిధులు రూ.20 లక్షలు మంజూరు చేసి రోడ్డు, డ్రైనేజీ నిర్మాణం మొదలుపెట్టారు. ఆదివారం ఈ ప్రాంతంలో భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. ఇచ్చిన మాట ప్రకారం రోడ్డు పనులను ప్రారంభించి సమస్యకు పరిష్కారం చూపిన మంత్రి రోజాకు స్థానిక మైనారిటీలు, మహిళలు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పీజీ నీలమేఘం, వైస్ చైర్మన్ బాలన్, కౌన్సిలర్లు భారతి, రమేష్, బీడీ భాస్కర్, భూపాలన్, మోహన్‌రాజ్, ఇంద్రయ్య, కోఆప్షన్ సభ్యులు హమీద్, ఆనంద్‌కుమార్, ఎల్లప్ప రెడ్డి, నాయకులు ఏఆర్ జైలాబ్దీన్, సంసుబాయ్, సలీం తదితరులు పాల్గొన్నారు.



మంత్రి రోజాకు కృతజ్ఞతలు తెలుపుతున్న మైనారిటీ మహిళలు

# పురవీధుల్లో బంగారమ్మ వైభవం

- అమ్మవారి బంగారు విగ్రహాన్ని రజకులకు అప్పగింత
- కార్వేటి నగరంలో మొదలైన జాతర సంబరాలు



వివిధ వేషధారణల్లో విశ్రాంత ఉద్యోగులు



పురవీధుల్లో విహరిస్తున్న శ్రీబంగారమ్మ అమ్మవారు

కార్వేటినగరం: మేజర్ పంచాయతీ కార్వేటినగరం ప్రజలు నాటి సంస్థానాధీశుల కాలం నుంచి కొంగుబంగారంగా కొలుస్తున్న శ్రీబంగారమ్మ అమ్మవారు ఆదివారం మేళతాళాల నడుమ పురవీధుల్లో దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఆలయ అధ్యక్షుడు ప్రసాద్ ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తుల సమక్షంలో అమ్మవారి బంగారు విగ్రహంతో పాటు, అమ్మవారి విలువైన ఆభరణాలను ఆనవాయితీ ప్రకారం రజకులకు అప్పగించారు. అనంతరం అమ్మవారికి పసుపు, చందనం, పాలు,పెరుగు, తేనె, నారికేళ జలాలు వంటి సుగంధ ద్రవ్యాలతో అభిషేకించారు. అనంతరం అమ్మవారిని పట్టు వస్త్ర, సుగంధ భరిత పుష్పమాలికలు, విశేష ఆభరణాలతో సుందరంగా అలంకరించి మేళతాళాలు, బందోబస్తు మధ్య పురవీధుల్లో ఊరేగించారు. అమ్మవారికి ఇంటింటా కర్పూర హారతులు పట్టి మొక్కులు చెల్లించుకున్నారు. మంగళ, బుధవారాల్లో జరిగే జాతరను పురస్కరించుకుని గ్రామ వీధులను అమ్మవారికి ఇష్ట ప్రసాదమైన వేపాకు తోరణాలతో అలంకరించి ముస్తాబు చేశారు. అలాగే గ్రామ వీధులను విద్యుత్ దీపాలతో ప్రత్యేకంగా అలంకరించారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు రంగనాథ మొదలియార్, కార్యదర్శి చంద్రశేఖర్ పిళ్లై, రజక సంఘ నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

**ఆకట్టుకున్న జాతర వేషధారణలు**

మేజర్ పంచాయతీ కార్వేటినగరంలో ఆదివారం నుంచి ప్రారంభమైన బంగారమ్మ జాతరను పురస్కరించుకుని విశ్రాంత ఉద్యోగులు ఆర్టీసీ డ్రైవర్ సుబ్రమణ్యంరాజు, మధు, చంద్ర, ధనశేఖర్ మొదలియార్ తదితరుల ఆధ్వర్యంలో వేసిన జాతర వేషధారణాలు చూపరులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా గ్రామ వీధుల్లో పొంగళ్ల గంపలతో తిరుగుతూ వివిధ రకాలైన ప్రదర్శనలు నిర్వహించారు. అనంతరం బంగారమ్మ ఆలయానికి చేరుకుని అమ్మవారికి కర్పూర హారతులు పట్టి మొక్కులు తీర్చుకున్నారు.

# భక్తిశ్రద్ధలతో ధనుర్మాస తిరుప్పావై





విద్యుత్ దీప కాంతుల్లో గంగమ్మ ఆలయం, ప్రత్యేక అలంకరణలో ద్రౌపదీదేవి అమ్మవారు

- ఆలయాల్లో అట్టహాసంగా ధనుర్మాస ఉత్సవాలు
- సంక్రాంతి పండుగ వరకు ఆలయాల్లో ఆధ్యాత్మిక శోభ



తిరుప్పావై ప్రవచన ధార చేస్తున్న గోవిందస్వామి

పుత్తూరు: పట్టణంలోని పలు ఆలయాల్లో ధనుర్మాస ఉత్సవాలను పురస్కరించుకుని ప్రత్యేక కార్యక్రమాలు, పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఆదివారం శ్రీద్రౌపదీదేవి సమేత శ్రీధర్మరాజులస్వామి ఆలయంలో ధనుర్మాసోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉదయం స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. ద్రౌపదీ, ధర్మరాజు, శ్రీకృష్ణుడిని పట్టు పీతాంబరాలు, విశేష స్వర్ణాభరణాలు, సుగంధ పరిమళభరిత పుష్పమాలికలతో సుందరంగా అలంకరించి కొలువుదీర్చి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. సాయంత్రం టీటీడీ ఆళ్వార్ దివ్య ప్రబంధ ప్రాజెక్టు ఆధ్వర్యంలో డాక్టర్ సి.గోవిందస్వామిచే తిరుప్పావై ప్రవచన కార్యక్రమం ప్రారంభమైంది. నెల రోజుల పాటు ప్రతి రోజూ సాయంత్రం 6.30 నుంచి 7.30 వరకు తిరప్పావై వైభవం నిర్వహిస్తారు. ఆలయాన్ని విద్యుత్ దీప కాంతులతో అందంగా అలంకరించారు. భక్తులకు ప్రసాద వితరణ చేశారు. కార్యక్రమాలను ఆలయ కమిటీ చైర్మన్ లారీమోహన్ పర్యవేక్షించారు. బజారు వీధిలోని గంగమ్మ ఆలయం, ఆరేటమ్మ ఆలయాల్లోని అమ్మవార్లకు ప్రత్యేక అభిషక పూజలు నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

### నూతన క్యాలెండర్ల ఆవిష్కరణ



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ముఖ్య అతిథులు

నగరి: పట్టణ పరిధిలోని బైపాస్ కూడలి వద్ద గల ఓంశక్తి ఆలయంలో నూతన సంవత్సర క్యాలెండర్లను ఆదివారం ఆవిష్కరించారు. స్థానిక ఎస్‌ఐ రాజాకుల్లాయప్ప, వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ రామచంద్రన్, డాక్టర్ అంబ్రోస్ విల్సన్ ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. శక్తి మాల ధరించి ఇరుముడి యాత్రలో పాల్గొనే భక్తులకు ఈ కొత్త క్యాలెండర్లను ఉచితంగా అందిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు.

### కరాటే పోటీల్లో ప్రతిభ



ప్రతిభ చూపిన క్రీడాకారులు

నగరి: నాగలాపురంలో నిర్వహించిన కరాటే టోర్నమెంట్‌లో నగరి జపాన్ షిటోరాయ్ కరాటే ద్వారా శిక్షణ పొందిన విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ముగ్గురు విద్యార్థులు ప్రథమ బహుమతులు, ముగ్గురు విద్యార్థులు ద్వితీయ బహుమతులు, నలుగురు తృతీయ బహుమతులు సాధించారు. ప్రతిభ చూపిన క్రీడాకారులను కరాటే మాస్టర్ రాజ్ కోటి అభినందించారు.

# 'మీకు చేసిన మేలు మరువకండి'

పుత్తూరు: రాష్ట్రప్రభుత్వం కరోనా కష్టకాలంలో రెండేళ్ల పాటు అంగన్‌వాడీ వర్కర్లకు పూర్తిస్థాయి జీతాలు అందించిందని, అలాగే ఎన్నో రకాలుగా మేలు చేసిందని, ఆ విషయాన్ని మరువకూడదని మున్సిపల్ వైస్ చైర్మన్ జయప్రకాష్ తెలిపారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ జీతాలు పెంచాలంటూ అంగన్‌వాడీ వర్కర్లు చేస్తున్న సమ్మెను వెంటనే విరమించుకోవాలని కోరారు. కరోనా సమయంలో దేశంలోని అన్ని రాష్ట్రాల్లో సగం జీతాలు ఇస్తే ఒక్క మన రాష్ట్రంలో మాత్రమే పూర్తిస్థాయి జీతాలు చెల్లించడం జరిగిందని గుర్తు చేశారు. అంగన్‌వాడీ వర్కర్లకు అన్ని సంక్షేమ పథకాలను వర్తింపజేయడం జరిగిందన్నారు. జగనన్న ఇంటి స్థలంతో పాటు నిర్మాణాలను మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. సంక్షేమ పథకాల ద్వారా అంగన్‌వాడీలకు ప్రభుత్వం ఇప్పటి వరకు ఎన్నో కోట్లు రూపాయలు ఖర్చు చేసిందన్నారు. ప్రస్తుత ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలలో గత చంద్రబాబు పాలనలో కనీసం 10 శాతం పథకాలు కూడా అందలేదన్న నిజాన్ని గుర్తించాలని సూచించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్న మంచి పనులకు గుర్తించి, సమ్మెను విరమించాలని కోరారు.

# క్షయవ్యాధిపై అప్రమత్తంగా ఉండాలి



గ్రామాల్లో సర్వే చేస్తున్న ఆరోగ్య సిబ్బంది

పాలసముద్రం: క్షయవ్యాధి పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండి మందులు సకాలంలో వాడితే వ్యాధి తీవ్రత పూర్తిగా తగ్గిపోతుందని పీహెచ్‌సీ వైద్యాధికారి మోహన్‌కృష్ణ తెలిపారు. ఆదివారం వీర్లగుడి దళితవాడలో ఏఎన్ఎం గంగాగౌరి, ఆశా వర్కర్ క్షయవ్యాధి గ్రామంలో రెండు వారాలకు మించి దగ్గుతూ ఉన్నా, అకస్మాత్తంగా బరువు కోల్పోయినా అలాంటి లక్షణాల ఉన్నవారి గురించి సర్వే చేట్టారు. గ్రామస్తులతో సూపర్‌వైజర్ సుశీల, మురళి మాట్లాడుతూ క్షయవ్యాధికి గురైనవారు మానసికంగా కృంగిపోతారని, సకాలంలో వ్యాధిని గుర్తించి మందులు క్రమం తప్పకుండా వాడితే వ్యాధి పూర్తిగా తగ్గిపోతుందన్నారు. ముందు వ్యాధిని గుర్తించడం చాలా సులభమన్నా రు. ఒక వ్యక్తికి ఆకలి లేకపోవడం, రెండు వారాలకు మించి దగ్గుతున్నా, అకస్మాత్తుగా బరువు కోల్పోవడం వంటి లక్షణాలు కలిగి ఉంటే తక్షణమే వైద్యులను సంప్రదించి డాట్ పద్ధతిలో మందులు వాడుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఆశా నళిని పాల్గొన్నారు.



స్వామివారికి వెండి తట్టను అందజేస్తున్న దాత సుబ్బారెడ్డి



ఆలయ అధికారులకు విరాళం అందజేస్తున్న దాత కుటుంబ సభ్యులు

# వరసిద్ధునికి విరాళాల వెల్లువ

కాణిపాకం(యాదమరి): కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయక దేవస్థానానికి నిత్యాన్నదానానికి రూ.లక్ష, వెండి హరతి పళ్లెం ఆదివారం విరాళాలుగా అందాయి. బెంగళూరుకు చెందిన సుబ్బారెడ్డి సుమారు రూ.75 వేల విలువైన కిలో వెండి తట్టను వితరణ చేశారు. ఉదయం ఆలయానికి విచ్చేసి అధికారులకు అందజేశారు. అలాగే నిత్యాన్నదానానికి నెల్లూరుకు చెందిన కోదండరామిరెడ్డి కుటుంబ సభ్యులు రూ.లక్ష విరాళం ఇచ్చారు. దాత కుటుంబ సభ్యులకు ఆలయ అధికారులు స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆలయ సూపరింటెండెంట్లు కోదండపాణి, వాసు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్లు విగ్నేష్, రమేష్ పాల్గొన్నారు.

**వినాయకుని సేవలో కాకినాడ ఎమ్మెల్యే**



కాకినాడ ఎమ్మెల్యే కురసాల కన్నబాబుకు స్వామివారి చిత్రపటం అందజేస్తున్న ఏఈవో

కాణిపాక శ్రీ వరసిద్ధి వినాయక స్వామిని ఆదివారం మాజీ మంత్రి, కాకినాడ ఎమ్మెల్యే కురసాల కన్నబాబు దర్శించుకున్నారు. కుటుంబ సమేతంగా ఆలయం వద్దకు వచ్చిన వారికి ఏఈవో హరిమాధవ రెడ్డి స్వాగతం పలికి స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించారు. అనంతరం ఆశీర్వాద మండపంలో వేద పండితులతో ఆశీర్వచనం అందించి స్వామివారి తీర్థ ప్రసాదాలు, చిత్రపటం అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ఇన్‌స్పెక్టర్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు



కళాకారుల నాట్య ప్రదర్శన



తిరుచానూరు(చంద్రగిరి): వారాంతపు సాంస్కృతిక కార్యక్రమంలో భాగంగా తిరుచానూరు సమీపంలోని శిల్పారామంలో ఆదివారం సాయంత్రం నిర్వహించిన భరతనాట్యం అలరించాయి. తిరుపతికి చెందిన శ్రీపదమ భరతనాట్యం డ్యాన్స్ ఆధ్వర్యంలో కళాకారులు నిర్వహించిన భరత నాట్యం ఆకట్టుకుంది. ఇందులో భాగంగా ఏకదంతాయ, నారాయణతే నమోనమో, నాగులమ్మ, పుష్పాంజలి, ముద్దుగారే యశోద, వేయినామాల వాడా, ఓం నమఃశివాయ తదితర పాటలకు కళాకారులు సువలక్ష్మీ, రిషిత, నందిని, దన్విత, తేజ, మంజరి, మహాలక్ష్మి, రజిత, హిమశ్రీ, యమున, రిషిత, తేజశ్రీ, చందన, స్మిత, దీప్తి ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. అనంతరం కళాకారులను ఏఓ ఖాదర్‌వ

# సాగుకు వేళాయె..!






శ్రీకావేరిరాజుపురంలో వరినాట్లు వేస్తున్న మహిళలు



నాట్లు వేసేందుకు వరినారు పెరుకుతున్న కూలీలు

రబీ సీజన్ ప్రారంభ దశలోనే ఈసారి వర్షాలు బాగా పడడంతో అన్నదాతల మోముల్లో ఆనందం వెల్లివిరిసింది. తాజాగా తుపాన్ ప్రభావంతో ఇటీవల కురిసిన వర్షాలకు రైతులు రబీ సీజన్‌లో పంటల సాగుకు పూర్తిగా సన్నద్ధమవుతున్నారు. శని, ఆదివారం నాడు పొలాలను దుక్కులు చేసే పనిలో బిజీబిజీగా గడిపారు. మండలవ్యాప్తంగా మొత్తం పంటల సాగు రబీ సీజన్‌లో 850 హెక్టార్లు కాగా, అందులో ప్రస్తుతం బోరు, బావుల కింద రైతులు సుమారు 589 హెక్టార్లలో వరి పంటను, మరి కొంతమంది రైతులు 95 హెక్టార్లలో వేరుశనగ సాగు చేస్తున్నారు. పలువురు రైతులు మాత్రం స్థానికంగా లభించే ఆకులతో జీవామృతం, ఘనజీవామత్యం తయారు చేసుకుంటుని పొలాల్లో వేసి దుక్కులు చేస్తున్నారు. తద్వారా పంటల్లో అధిక దిగుబడి పొందే అవకాశాలు ఉంటాయి. వేరుశనగ, వరి పంటలను సాగు చేసేందుకు ఈ నెలాఖరు వరకు మంచి అదును అని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. –పాలసముద్రం





వరి నాట్లు వేసే ముందు ఎరువు చల్లుతున్న రైతులు, భూమిలో ఆకులు వేసి దుక్కులు చదును చేస్తున్న రైతులు